సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 28-12-2024

సంపుటి: 20 సంచిక: 234

పేజీలు: 4 వెల: రూ.1



## 29న శివకామేశ్వరాలయంలో అభిషేకాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొండేటివీధిలోని శ్రీ లలితాదేవి సహిత శివకామేశ్వర ఆలయంలో బహుళ త్రయోదశి తత్కాల చతుర్దశి సందర్భంగా ఈ నెల 29న ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు మొండేటి వీధి శ్రీ షిర్డీసాయి సేవాసంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మాస శివరాత్రి సందర్భంగా ప్రదోష కాలంలో శ్రీ లలితా సహిత శివకామేశ్వరి స్వామి, నందీశ్వర స్వామికి సుగంధ ద్రవ్యాలతో విశిష్ట అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమం, రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.







# నిధులున్నా సౌకర్యాలు సున్న

- రిమ్స్ కళాశాలలో సమస్యల తిష్ఠ
- క్యాంటీన్‌లో భోజనం నోట్లో పెట్టలేం
- తాగే నీటికి పాదయాత్ర తప్పనిసరి
- హాస్టల్‌కు విద్యుత్ సరఫరా బంద్
- స్నానాలు, చదువులకు కొద్దిరోజులుగా సెలవ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రిమ్స్ సర్వజన అసుపత్రి, మెడికల్ కళాశాల బ్రాండ్ ఇమేజ్‌ను అధికారులే దెబ్బతీస్తున్నారు. దేశంలో టాప్ 50 జాబితాలో ఉన్న రిమ్స్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించడానికి దేశంలో అనేక రాష్ట్రాలకు చెందిన విద్యుర్థులు ఉత్సాహం చూపిస్తుంటారు. ఆలిండియా మెడికల్ కౌన్సిల్ నిర్వహించే కౌన్సిలింగ్ ద్వారా అనేక మంది ఉత్తర, దక్షణ భారతదేశంకు చెందిన విద్యార్థులు రిమ్స్‌లో చేరుతున్నారు. 2007లో 50 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభమైన రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రస్తుతం పీజీ స్థాయికి చేరింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రిమ్స్‌లో వైద్య విద్యను అభ్యసించడానికి చేరిన విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. కళాశాల నిర్వహణకు, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కేటాయించే నిధులను ఖర్చు చేయకుండా వెనక్కు జమ చేసే అధికారులు ప్రస్తుతం కళాశాలను పర్యవేక్షిస్తున్నారు. కళాశాలకు గతంలో డైరెక్టర్ పోస్టు ఉండేది. ఇప్పుడు దాన్ని ప్రిన్సిపల్ పోస్టుగా మార్చేశారు. రాష్ట్రంలోనే సీనియర్ మోస్ట్ హృద్రోగ వైద్య నిపుణుడిగా అనుభవం కలిగిన వ్యక్తి ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్నా వైద్య విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదని ఆరోపణలు ఉన్నాయి.

### బాయ్స్ హాస్టల్‌లో విద్యుత్ కష్టాలు

రిమ్స్ వైద్యకళాశాలలో విద్యను అభ్యసించే మొదటి ఏడాది విద్యార్థులకు వసతి కల్పిస్తున్న బాయ్స్ హాస్టల్‌లో కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా లేదు. రెండు నెలల క్రితం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ప్రిన్సిపల్ దృష్టికి తీసుకువెళ్లినా సమస్యకు పరిష్కారం చూపించలేదు. విద్యార్థులు రోజులు తరబడి స్నానాలు చేయకుండా ఉండాల్సి వస్తుందంటే పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థమవుతుంది. ప్రిన్సిపల్‌కు సమస్యను విన్నవించిన ప్రతిసారీ చేసేద్దాం, అయిపోద్ది అని చెప్పి విద్యార్థులను పంపించేస్తున్నారు. బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థులు మొబైల్ ఫోన్లు ఛార్జింగ్ కోసం ఆస్పత్రికి వెళుతున్నారు. ఓల్టేజ్ సమస్య వల్ల ఫ్యాన్లు తిరగడం లేదు. మొదటి ఏడాది నుంచి నాలుగో ఏడాది వరకు మొత్తం 200 మంది విద్యార్థులు బాయ్స్ హాస్టల్స్‌లో ఉంటున్నారు. బాయ్స్ హాస్టల్‌లో పరిస్థితి ఇలా ఉంటే.. గర్ల్స్ వసతిగృహంలో పరిస్థితి ఏమిటో వేరేగా చెప్పనక్కర్లేదు. సమస్యను కుటుంబ సభ్యులకు చెప్పడానికి అమ్మాయిలు సాహసించడం లేదు. ఒకవేళ కళాశాలలో ఉత్పన్నమవుతున్న దారుణాలు వెలుగులోకి వస్తే విద్యార్థులను టార్గెట్ చేసి ప్రాక్టికల్స్ మార్కుల్లో కోత పెట్టి ఇబ్బంది పెడతారని భయం వైద్య విద్యార్థుల్లో ఉంది.

### ఆహారం సరఫరాలో వ్యత్యాసం

ఈ సమస్యతో పాటు కళాశాలలో రెండు క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి నాలుగో ఏడాది విద్యార్థులంతా ఒక క్యాంటీన్‌లో భోజనం చేయాలి. రెసిడెంట్ డాక్టర్లు, పీజీ విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్ ఆహారం పంపిణీ చేస్తున్నారు. విద్యార్థులకు అక్కడ క్యాంటీన్ నిర్వాహకులు ఏది పెడితే అది తినాలి. ఆహారం బాగులేదని ప్రత్యేక క్యాంటీన్లో భోజనం చేయడానికి అవకాశం లేదు. ప్రతి నెల మెస్‌కు రూ.3,600 బిల్లు కట్టి అక్కడ వారు పెట్టే ఆహారం తినలేక, రిమ్స్ బయటకు వచ్చి తింటున్నారు. వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు ఒకే మొత్తాన్ని అంటే రూ.3,600 నెలకు చెల్లిస్తున్నా వేర్వేరు క్యాంటీన్లు ఏమిటనే ప్రశ్న తలెత్తుతుంది. వైద్య విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన క్యాంటీన్‌ను మూడో ఏడాది వైద్య విద్యను బోధించే ప్రొఫెసర్ కాంట్రాక్ట్ తీసుకొని సరఫరా చేస్తున్నట్టు తెలిసింది. దీంతో సీనియర్ విద్యార్థులు జూనియర్లను ఫుడ్‌పై కంప్లైయింట్ పెట్టవద్దని హెచ్చరిస్తున్నారు. కంప్లైయింట్ పెడితే మూడో ఏడాది వైద్య విద్యను భోదించే ప్రొఫెసర్ కాబట్టి సమస్యలు ఎదురవుతాయని హితబోధ చేస్తున్నారని తెలిసింది. దీంతో క్వాలిటీ ఆహారం అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సమాచారం. మధ్యాహ్నం కేవలం ఒక గంట మాత్రమే భోజన విరామ సమయం కాబట్టి కళాశాల బయటకు వచ్చి ఆహారం తినే అవకాశం కూడా లేదు.

### నీటిని కొనుక్కొని తాగుతున్నారు

తగినంత పౌష్టికాహారం అందకపోతే చదువును ఎలా కొనసాగించగలమన్న ఆలోచనతో వైద్యవిద్యార్థులు సతమతమవుతున్నారు. బాయ్స్ వసతి గృహంలో తాగేందుకు నీరు అందుబాటులో లేదంటే నమ్మశక్యం కాదు. విద్యార్థులే బయట నుంచే వాటర్ బాటిల్స్ కొనుక్కొని తెచ్చుకుంటున్న పరిస్థితి. లేదంటే ఇద్దరు ముగ్గురు విద్యార్థులు కలిసి 20 లీటర్ల వాటర్ కేన్స్ తెచ్చుకుంటున్నారు. మరికొన్ని సందర్భాల్లో కాలేజీకి వెళ్లిన సమయంలో అక్కడ నుంచి హాస్టల్‌కు వచ్చినప్పుడు బాటిల్స్‌లో డ్రింకింగ్ వాటర్ నింపుకొని వారి వెంట తెచ్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారని తెలిసింది. కాలేజీ నుంచి

- మిగతా 4లో



• ఎడిటోరియల్

# ఈ సంక్షోభాలు అప్పటివే..

నూతన ఆర్థిక విధానాల మీద అభిప్రాయాలు, దృక్పథాలు ఎట్లా ఉంటాయన్నదాన్ని బట్టి మన్మోహన్ సింగ్ మీద అంచనాలు ఉంటాయి. ఈ దేశానికి అత్యవసరమైన సమయంలో అత్యంత నిర్ణయాత్మక పాత్ర పోషించారని చాలామంది ఆయనను కీర్తిస్తారు. పదేళ్లు ప్రధానిగా కంటే పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఆయన పాత్ర గొప్పదని భావిస్తారు. సంస్కరణల ఫలితాలు తాము ఆశించినట్టుగా లేవని పీవీతో పాటు, మన్మోహన్ సింగ్ కూడా అనేకమార్లు ఆత్మవిమర్శ లాంటిదేదో వ్యక్తం చేశారు. ఇవాళ చూస్తున్న జుగుప్సాకరమైన సంపద కేంద్రీకరణ, నిస్సిగ్గు ఆశ్రిత కార్పొరేటిజం, వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభాలు ముప్పై మూడేళ్ల కిందట మొదలైన సంస్కరణల పర్యవసానాలే. దేశంలో ఇప్పుడు దృశ్యమానంగా ఉన్న నిట్టనిలువు అభివృద్ధి, రోడ్లు, రేవులు, విమానాశ్రయాలు, కమ్యూనికేషన్లు, విలాస జీవనావకాశాలు కూడా ఈ కాలపు మహిమలేనని ఒప్పుకోవాలి. అస్వతంత్ర ప్రధాని అని పేరు తెచ్చుకున్నా, తన విధానాల విషయంలో కఠినంగానూ నిక్కచ్చిగానూ ఉన్న వ్యక్తి మన్మోహన్‌సింగ్. అంతే కాదు, విద్యాధికుడిగా, ఆర్థిక రంగ నిపుణుడిగా, గంభీరుడిగా ఆయన ప్రధాని పదవికి ఉండవలసిన గౌరవాన్ని కొనసాగించారు. మతతత్వ వ్యతిరేకత, సహజీవన సంస్కృతి వంటి జాతీయోద్యమ విలువల విషయంలో ఆయన ఆధునిక ఉదార, లౌకికవాదిగా కొనసాగారు. ప్రధానిగా ఆయన రెండోదఫా పాలనలో ప్రభుత్వం బలహీనపడి, సంకీర్ణ భాగస్వాముల మధ్య సమన్వయ రాహిత్యం పెరిగి, ఎవరికివారు స్వలాభంలో స్వార్జనలో మునిగిపోవడంతో, విమర్శకులు ఆరోపించినట్టు, విధాన, పాలనా వైకల్యాలు ముదిరిపోయాయి. 2014లో బీజేపీ ఘనవిజయం సాధించడానికి మన్మోహన్ వైఫల్యాలే కారణం. మన్మోహన్‌ను కూడా అభ్యుదయ, సమన్యాయవాదిగా పరిగణించవలసిన ఒకానొక సందర్భాన్ని ఇటీవలి ఎన్నికలకు ముందు చెలరేగిన వివాదం తీసుకువచ్చింది. సంక్షేమ వనరులను అందుకునే మొదటి హక్కు మైనారిటీలదే అని మన్మోహన్ 2006లో అన్నారని, మైనారిటీలకు, ముఖ్యంగా ముస్లిములకు దోచిపెట్టడమే కాంగ్రెస్ విధానమనడానికి అదే రుజువని బీజేపీ గట్టి ప్రచారం చేసింది. తన మాటల వక్రీకరణ మీద మన్మోహన్ వెనువెంటనే ఖండన, వివరణ ఇచ్చారు. ఆయన ఆనాడు అన్న మాటలను మరోసారి గుర్తు చేసుకోవడం ఈ సందర్భంగా న్యాయం. 2006 డిసెంబర్ 9న జాతీయాభివృద్ధి మండలి సమావేశంలో మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఇలా అన్నారు. 'మన సమష్టి ప్రాధాన్యాలు స్పష్టంగా ఉన్నాయని అనుకుంటున్నాను. వ్యవసాయం, సాగునీరు, జలవనరులు, ఆరోగ్యం, విద్య, గ్రామీణ మౌలిక సదుపాయాలలో ఆవశ్యకమైన పెట్టుబడి, మొత్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రభుత్వ కేటాయింపులు, వీటన్నిటితో పాటు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, మహిళలు, పిల్లల అభ్యున్నతి కోసం కార్యక్రమాలు, ఇవీ ఆ ప్రాధాన్యాలు. ఎస్సీ, ఎస్టీల వాటా ప్రణాళికలను పునరుజ్జీవింపజేయాలి. మైనారిటీలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలు అభివృద్ధి ఫలాలలో న్యాయమైన భాగం పొందడానికి కొత్తరకం పథకాలు రచించాలి. ఈ శ్రేణులకు, కార్యక్రమాలకు వనరుల మీద మొదటి హక్కు ఉండాలి. కేంద్రప్రభుత్వానికి ఇంకా అసంఖ్యాకమైన ఇతర బాధ్యతలున్నాయి, వాటన్నిటిని అందుబాటులోని వనరులలో సర్దుబాటు చేయాలి.' ప్రాధాన్య రంగాలకు, అభ్యున్నతి అవసరమైన శ్రేణులకు వనరులలో మొదటి హక్కు ఉండాలని చెప్పినదాన్ని, ముస్లిం మైనారిటీలకు పెద్ద పీట వేయాలని మన్మోహన్ అన్నట్టుగా అన్వయించారు. మొదటి హక్కు పొందవలసినవారిలో ముస్లిములు, ఇతర మైనారిటీలు కూడా ఉన్నారు, కానీ, వారు మాత్రమే లేరు. ఈ పదేళ్ల కాలం అనేక గతకాలాల మీద అభిప్రాయాలను, అంచనాలను సవరించింది. ఆ రోజులే బాగున్నాయేమోనన్న సాపేక్ష భావనలను కలిగించింది. అనేక విమర్శలున్న పాత నేతలలో మంచిని వెదికేట్టు చేసింది. అభివృద్ధి ఫలితాలు, ప్రజా వనరులు కంపెనీలకు, సంపన్నులకు చెందే విధానాలు రూపొందించారన్న విమర్శలు, ప్రశంసలు పొందిన మన్మోహన్ సింగ్, ప్రభుత్వ కేటాయింపుల్లో, సంక్షేమ వనరుల్లో మొదటి ముద్ద బాధిత శ్రేణులకు చెందాలని అన్న పాపానికి తీవ్రమైన దాడి ఎదుర్కొన్నారు! మన్మోహన్ పట్ల కాంగ్రెస్ అధిష్టానం చాలా అవమానకరంగా ప్రవర్తించేది. సోనియా అతన్ని నానా మాటలు అనేది. రాహుల్ అయితే ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించేవాడు. ఈ అవమానాలన్నింటినీ ఆయన పంటి బిగువున భరించేవాడు అని రేపట్నుంచి బీజేపీ ప్రచారం చేసినా ఆశ్చర్యపోనవసరంలేదు.



# విషాదం నుంచి.. విజయం వైపు!

కొన్ని విషాదకథలు వెంటాడేవి. అలాంటి భయంకరమైన దృశ్యం 2004లో హిందూ మహాసముద్రంలో వచ్చిన సునామీ. ఎక్కడో ఇండోనేషియా సుమత్రా దీవుల్లో వచ్చిన భూప్రకంపనల ప్రభావం ఇటు భారత్ నుంచి మొదలుకుంటే శ్రీలంక, థాయ్ లాండ్ వంటి ఎన్నో దేశాలు ఎదుర్కొన్న విపత్తు నభూతో నభవిష్యత్తన్నంత భయంకరం. ఆ సునామీ మిగిల్చిన విషాదంలో ఒక శ్రీలంకలోనే 35 వేల మంది మృత్యువాత పడ్డారు. అయితే, అందులోనూ కొన్ని కదిలించే కథలు.. ఇప్పుడు పెరిగి పెద్దవై మన ముందు ఆశకు చిరునామాలా నిలుస్తుండటమే స్ఫూర్తిదాయక విషయం ఆ పేరే బేబీ 81. అసలు పేరు జయరాసా అభిలాష్. ఆనాడు సునామీలో రెస్క్యూ ఆపరేషన్ లో లభించిన శ్రీలంకకు చెందిన జయరాసా అభిలాష్ ఇప్పుడు ఉన్నత విద్యనభ్యసిస్తూ నాటి విషాదం నుంచి బయటపడి విజయంవైపు దూసుకెళ్తున్నాడు.



తనను రెస్క్యూ టీం సముద్రపు రాకాసి అలల నుంచి కూతవేటు దూరంలో ఉన్న బురదలో గుర్తించి కాపాడారు. తల్లిదండ్రులెవరో తెలియకుండానే పెరిగాడు. తమ అబ్బాయేనంటూ కొందరు క్లెయిమ్ చేస్తూ కోర్టుకెక్కే వరకూ.. డీఎన్ఏ పరీక్షల వరకూ ఆ తర్వాత సునామీని మించిన జీవిత సవాళ్లనెదుర్కొన్నాడు అభిలాష్.

మానవజాతి ఆధునిక చరిత్రలోనే అత్యంత విషాద ఘట్టం 2004 సునామీ. ఆ సమయంలో రెండు నెలల బాబు తూర్పు శ్రీలంక ప్రాంతంలో పూర్తిగా బురదలో కప్పబడి రెస్క్యూ టీంకు కనిపించాడు. అంత విషాదంలో వేల మంది ప్రాణాలు కోల్పోయిన ఓ దుర్ఘటనలో.. ఆశ అనే పదానికి ప్రతిరూపంగా కనిపించిన ఆ రెండు నెల్ల బాబును రెస్క్యూ టీం కాపాడింది. ఓ అనాథలా లభించిన అతణ్ని హాస్పిటల్ లో జాయిన్ చేశారు. హాస్పిటల్‌లో పేషంట్ నంబర్ 81గా నమోదయ్యాడు ఆ బాలుడు. అందుకే తనను అప్పట్నుంచీ బేబీ నంబర్ 81గా అంతా పిల్చుకునేవారు. ఇప్పుడు ఆ బాలుడే జయరాసా అభిలాష్‌గా 20 ఏళ్ల ఎత్తుకెదిగాడు. ఉన్నత చదువులు చదువుతున్నాడు.

అయితే, సునామీ సమయంలో చావు అంచుల నుంచి బతికి బట్ట కట్టి ఇప్పుడు విజయం సాధించాలన్న కసితో జయరాసా అభిలాష్ అడుగులేయడం ఒక స్ఫూర్తిగాథైతే చిన్నాభిన్నమైన తన కుటుంబాన్ని మళ్లీ కలుసుకోవడం అంత సునామీ తాలూకు విషాదంలో ఓ మిరాకిల్.

జయరాసా తండ్రి మురుగుపిళ్లై తన కుటుంబం కోసం నెలల తరబడి వెతికాడు. తన భార్యను, తల్లిని కలుసుకోగల్గాడు. కానీ, రెండు నెలల వయస్సులో సునామీ రేపిన ఉత్పాతానికి అదృశ్యమైనపోయిన కొడుకు మాత్రం లభించలేదు. కానీ, సంకల్పముంటే అనుకున్నది సాధించవచ్చన్న కసితో మురుగుపిళ్లై తన కొడుకును కలుసుకోగల్గాడు. అదీ అంత సామాన్యంగా ఏమీ జరగలేదు.

జయరాసా అభిలాష్ కోసం తమ కొడుకంటే తమ కొడుకంటూ ఏకంగా 9 కుటుంబాలు క్లెయిమ్ చేసుకున్నాయి. ఒక నర్సు దగ్గర జయరాసా అభిలాష్ పెరుగుతున్నాడన్న విషయాన్ని తెలుసుకున్న తండ్రి మురుగుపిళ్లై కూడా మిగిలిన తొమ్మిది కుటుంబాల్లాగే సదరు పిల్లాణ్ని పెంచుతున్న నర్సు దగ్గరకు చేరుకున్నాడు. ఆ విషయం కాస్తా ఏకంగా చట్టపరమైన ప్రక్రియగా మారిపోయింది. దాంతో మురుగుపిళ్లై కోర్టుకెక్కాడు. తమ కొడుకేనంటూ తనకు న్యాయం చేయలాని కోరాడు. కోర్ట్ తీర్పు వచ్చేవరకూ ఆసుపత్రిలోనే పిల్లవాణ్నుంచాల్సి వచ్చింది.

### న్యాయపోరాటం - డీఎన్ఏ పరీక్ష!

కేసు కోర్టుకు వెళ్లింది. న్యాయమూర్తి డీఎన్ఏ పరీక్షకు ఆదేశించారు. అయితే, అక్కడ మురుగుపిళ్లై తరహాలో మిగిలిన కుటుంబాలు మాత్రం తమ కొడుకేనంటూ కోర్టుకెక్కకపోవడం ఇంకో అడ్వంటేజైంది. కోర్ట్ ఆదేశాలతో జయరాసా, మురుగుపిళ్లైకి సంబంధించిన డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యాయి. తుది ఫలితాలు మురుగుపిళ్లయే జయరాసా అభిలాష్ తండ్రి అని తేల్చాయి. జయరాసా అభిలాష్ కథ.. అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది.

### సునామీ తర్వాత అభిలాష్ జీవితం!

ప్రస్తుతం అభిలాష్ తన హైస్కూల్ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఏదైనా మంచి విశ్వవిద్యాలయంలో ఐటీ చదవాలన్నది అభిలాష్ అభిలాష. అయితే, అభిలాష్ స్కూల్ జీవితంలో బేబీ 81 అనే పేరే స్థిరపడి తనను చాలా ఇబ్బంది పెట్టిందంటాడు తను. కానీ, తన తండ్రి మాత్రం తనను ప్రోత్సహించాడని.. ఇలాంటి పేరు ప్రపంచంలో ఇంకెవ్వరికీ లేదనేవాడనీ చెబుతాడు అభిలాష్.

### సునామీ మృతులకు ఓ స్మారక చిహ్నం!

సునామీ నుంచి చిన్నాభిన్నమైన జయరసా ఫ్యామిలీకి రిలీఫ్ ఫండ్ కూడా అందకపోవడంతో మరిన్ని సవాళ్లు ఎదుర్కోక తప్పలేదు. జయరసా అభిలాష్ కుటుంబ కథ అంతర్జాతీయంగా దృష్టిని ఆకర్షించడంతో వారి అమెరికా ప్రయాణం ఆ ఆర్థిక సాయానికి అడ్డంకిగా మారింది. అయినప్పటికీ ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా విడిపోయి మళ్లీ కలిసిన జయరాసా కుటుంబం.. సునామీ మృతుల స్మృత్యార్థం తమ ఇంటి పెరట్లో ఓ స్మారక చిహ్నాన్ని కూడా ఏర్పాటు చేసింది. వారందరినీ గుర్తు చేసుకోవడానికే ఆ స్మారక స్థూప ఏర్పాటంటోంది ఆ కుటుంబం. అభిలాష్ జీవిత ప్రయాణం యూనిక్‌గా సాగాలని ఆశిస్తున్నాడు తండ్రి మురుగుపిళ్లై. మనుగడే ప్రశ్నార్థకమైన హృదయవిదారక దృశ్యం నుంచి చిగురించిన కొత్త ఆశగా అభిలాష్ జీవితం ఇప్పుడో ఉదాహరణ.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...




**కథ:** అర్జున్ మహాక్షయ్ (కిచ్చా సుదీప్) ఒక సిన్సియర్ పోలీసాఫీసర్. అతను ఏ ఒక్క చోటా ఎక్కువ కాలం డ్యూటీ చేయడు. నేరం చేసిన ఎవ్వరినీ వదిలిపెట్టడు. తన విధులకు ఎంతటి వారు అడ్డు వచ్చినా ఎదిరిస్తాడు. అందుకే చాలా సార్లు బదిలీ అవుతాడు. ఒక కేసుకు సంబంధించి సస్పెండ్ అయిన అతను.. సస్పెన్షన్ ముగించుకుని బెంగళూరు శివార్లలోని ఓ స్టేషన్‌కు సీఐగా ఛార్జ్ తీసుకోవడానికి సిద్ధమవుతాడు. ఐతే రేపు ఉదయం విధుల్లోకి రావాల్సిన అర్జున్.. ముందు రోజు రాత్రి రోడ్డు మీద హద్దులు మీరి ప్రవర్తించి పోలీసుల మీద దాడి చేసిన ఇద్దరు మంత్రుల కొడుకులు ఇద్దరిని అరెస్ట్ చేసి స్టేషన్లో పడేస్తాడు. కానీ ఆ ఇద్దరూ పోలీస్ స్టేషన్లో అనూహ్య పరిస్థితుల్లో ప్రాణాలు వదులుతారు. వాళ్లెలా చనిపోయారన్నది మిస్టరీగా మారుతుంది. ఈ విషయం బయటికి పొక్కకుండా చూసుకోవడం.. ఈ వ్యవహారం నుంచి తనతో పాటు స్టేషన్లోని మిగతా పోలీసులను కాపాడుకోవడం.. మరోవైపు మంత్రుల కొడుకుల కోసం వస్తున్న గ్యాంగుల్ని కాచుకోవడం.. అర్జున్ కు పెద్ద సవాలుగా మారుతుంది. ఈ స్థితిలో అతనేం చేశాడు.. ఈ సవాళ్లను ఎలా ఛేదించాడు అన్నది మిగతా కథ.

**నటీనటులు:**
కిచ్చా సుదీప్ స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోయింది 'మ్యాక్స్'లో. టఫ్ పోలీసాఫీసర్ పాత్రకు అతను పర్ఫెక్ట్ గా సూటయ్యాడు. పోలీస్ అన్న మాటే కానీ.. కథ రీత్యా సినిమాలో ఎక్కడా అతను ఖాకీ దుస్తుల్లో కనిపించడు. అయినా అతణ్ని పోలీస్‌గానే ఫీలవుతాం. అంత బాగా ఆ పాత్రను పోషించాడు సుదీప్. మాస్ ప్రేక్షకులు మెచ్చేలా హీరోయిజాన్ని పండించడంలో సుదీప్ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ద్వితీయార్ధంలో తన పాత్ర బాగా ఎలివేట్ అయింది. కరప్ట్ పోలీస్ పాత్రలో వరలక్ష్మి శరత్ కుమార్ తన ఉనికిని చాటుకుంది. ఆమెకు సూటయ్యే పాత్రనే ఇచ్చాడు దర్శకుడు. సునీల్ విలన్లలో ఒకడిగా బాగానే చేశాడు. మరో తెలుగు నటుడు వంశీకి చెప్పుకోదగ్గ పాత్ర పడలేదు. పోలీస్ పాత్రల్లో సంయుక్త కోర్నాడ్.. ఇలవరసు ఓకే. కానీ పోలీస్ బృందంలోని వాళ్లలో కొందరు మరీ అతిగా నటించిన ఫీలింగ్ కలుగుతుంది.

# ఒక మోస్తరు మాస్!

**సాంకేతిక వర్గం:**
అజనీష్ లోక్ నాథ్ మరోసారి తన నేపథ్య సంగీతంతో మెప్పించాడు. కొన్ని చోట్ల మరీ లౌడ్ అనిపించినప్పటికీ.. సినిమాకు నప్పేలా.. కొన్ని చోట్ల గూస్ బంప్స్ ఇచ్చేలా అతను బ్యాగ్రౌండ్ స్కోర్ అందించాడు. చివరి అరగంటలో స్పీకర్లు బద్దలయిపోయే రేంజిలో మాస్ ను ఉర్రూతలూగిస్తూ సాగుతుంది స్కోర్. రెండు బిట్ సాంగ్స్ మినహాయిస్తే ఇందులో చెప్పుకోదగ్గ పాటలేమీ లేవు. శేఖర్ చంద్ర ఛాయాగ్రహణం బాగుంది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. సినిమా రిచ్ గా తెరకెక్కింది. రైటర్ కమ్ డైరెక్టర్ విజయ్ కార్తికేయ సగటు మాస్ సినిమాలకు భిన్నంగా వైవిధ్యమైన కథనే ఎంచుకున్నాడు. దాన్ని మాస్ స్టయిల్లో నరేట్ చేయడానికి ప్రయత్నించాడు. అతను రాసుకున్న స్క్రీన్ ప్లే ఆసక్తికరంగానే సాగింది. కానీ 'ఖైదీ'తో పోలికలు అనివార్యంగా అనిపిస్తాయి. విలన్ల పాత్రలను మరింత బాగా తీర్చిదిద్దు కుని ఉంటే.. కొత్త సీన్లు రాసుకుని ఉంటే 'మ్యాక్స్' ఔట్ పుట్ ఇంకా మెరుగ్గా ఉండేది.

**కథనం-విశ్లేషణ:**
కన్నడ సినిమాలంటే రొడ్డకొట్టుడు అనే ఫీలింగ్ ఉండేది ఒకప్పుడు. తెలుగు.. తమి ళ చిత్రాలను రీమేక్ చేస్తూ.. వాటిని అను కరిస్తూ సగటు మాస్ మసాలా సినిమా లే తీసేవాళ్లు అక్కడి దర్శకు లు. కానీ గత కొన్నేళ్లలో కన్నడ సినిమాల తీరే మారిపోయింది. కేజీఎఫ్.. కాంతార లాంటి సినిమా లతో దేశం దృష్టిని ఆకర్షించిన కన్న డ పరిశ్రమ నుంచి ఇప్పుడు వైవిధ్య మైన సినిమాలు వస్తున్నాయి. మాస్ సినిమాలనే కొంచెం డిఫరెంటుగా మలి చే ప్రయత్నం జరుగుతోంది. కిచ్చా సుదీ ప్ కొత్త చిత్రం 'మ్యాక్స్' కూడా ఈ కోవలో నిదే. ఇందులో హీరోయిజం ఉంది. ఎలివేష న్లు ఉన్నాయి. యాక్షన్ డోస్ కూడా తక్కువేమీ కాదు. కానీ అది రొటీన్ స్టయిల్లో మాత్రం ఉండదు. విషయం ఉన్న కథ నేపథ్యంలోనే అన్ని మసాలాలు ఉండేలా చూసుకున్నాడు దర్శకుడు విజయ్ కార్తికేయ. లోకేష్ కనకరాజ్ కల్ట్ మూవీ 'ఖైదీ' స్ఫూర్తితో తెరకెక్కిన 'మాస్' కథ ప్రధానంగా రేసీగా సాగిపోతూనే మాస్ మూమెంట్స్ తో ఆ వర్గం ప్రేక్షకులనూ అలరిం చేలా సాగుతుంది. కొన్ని బలహీనతలు ఉన్నా సరే.. ఒకసారి చూడ్డానికి ఢోకా లేని మాస్ మూవీ ఇది.

ఎంత కాదనుకున్నా 'మ్యాక్స్'లో 'ఖైదీ' సినిమా పోలికలు చాలానే కనిపిస్తాయి. ఇది దాని తరహాలోనే ఒక్క రాత్రిలో ముగిసిపోయే కథ. అక్కడా ఇక్కడా పోలీసులకు.. నేరస్థులకు మధ్య జరిగే టామ్ అండ్ జెర్రీ తరహా పోరు నేపథ్యంలో కథ నడుస్తుంది. పోలీసులు అనుకోని సమస్యలో చిక్కుకుని ఆ టాస్క్ నుంచి బయటపడడానికి చేసే పోరాటం నేపథ్యంలో సినిమా సాగుతుంది. ఐతే దాని మాదిరే ఇది కూడా ఉత్కంఠ పెంచుతూ.. తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తిని రేకెత్తిస్తూ సాగుతుంది. కిచ్చా సుదీప్ పెద్ద మాస్ హీరో అయినప్పటికీ.. సగటు మాస్ సినిమాల్లో మాదిరి ఇంట్రోలు.. బిల్డప్పులు.. రొటీన్ ఎలివేషన్లు.. పాటలు.. ఫైట్లు అంటూ ఫార్ములా స్టయిల్లో సినిమాను నడిపించలేదు దర్శకుడు విజయ్ కార్తికేయ. హీరో పాత్రకు ఎలివేషన్ ఇచ్చినా.. అతను ఫైట్ చేసినా.. అది కథను అనుసరించే ఉంటుంది. కథను దాటి ఇందులో ఏమీ జరగలేదు. కాబట్టే మాస్ ప్రేక్షకులే కాక క్లాస్ ఆడియన్స్ కూడా ఈ పాత్రతో కనెక్ట్ అవుతారు. ఒక పెద్ద ఇన్సిడెంట్ జరగడం.. దాన్ని అనుసరించే సిరీస్ ఆఫ్ ఈవెంట్స్ తరహాలో కథ ముందుకు సాగడం వల్ల ప్రేక్షకులు ఎక్కడా డీవియేట్ కారు. కథను మలుపు తిప్పే ఆ ఇన్సిడెంట్ సినిమా ఆరంభంలోనే వచ్చేయడంతో ప్రేక్షకులు కథలో ఇన్వాల్వ్ అవుతారు.

పోలీస్ స్టేషన్లోనే మంత్రుల కొడుకులు చనిపోవడం.. తన మీద దీన్ని కవర్ చేయడానికి హీరో వేసే ఎత్తుగడల నేపథ్యంలో స్క్రీన్ ప్లే ఆసక్తికరంగా సాగుతుంది. కథనం మరీ పరుగులు పెట్టకపోయినా.. ఆసక్తికర సీన్లతో తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ రేకెత్తిస్తూ 'మ్యాక్స్' ప్రథమార్ధం సాగుతుంది. ప్రథమార్ధమంతా డిఫెన్స్ మోడ్లో ఉండే హీరో పాత్ర.. రెండో అర్ధంలో ఎటాక్ మోడ్లోకి రావడంతో అందుకు తగ్గట్లే కథనం కూడా ఊపందుకుంటుంది. కొన్ని యాక్షన్ ఘట్టాలు కూడా తోడై 'మ్యాక్స్' మాస్ ను అలరిస్తూ ముందుకు సాగుతుంది. ఐతే బలమైన విలన్ పాత్రలు లేకపోవడం 'మ్యాక్స్'కు మైనస్ అయింది. సునీల్.. వరలక్ష్మిల పాత్రలు అనుకున్నంత బలంగా లేకపోవడం వల్ల హీరోకు ఎదురే లేదన్నట్లుగా సాగిపోతుంది. దీనికి తోడు మంత్రుల కొడుకులు చేసిన అరాచకం గురించి ఏమీ చూపించకుండా చిన్న సన్నివేశంతో సరిపెట్టడం బాగా అనిపించదు. ముందే వాళ్లు చేసిన దారుణాన్ని చూపించి ఉంటే.. ఆ పాత్రలను ముగించడం సరైన పేఆఫ్ అయ్యుండేది. ఇలా కొన్ని లోపాలున్నప్పటికీ 'మ్యాక్స్' ఆద్యంతం ఎంగేజింగ్ గానే సాగుతుంది. మాస్-యాక్షన్ వినోదాన్ని అందిస్తూనే డిఫరెంట్ స్టయిల్లో నడిచే మ్యాక్స్.. 'ఖైదీ' తరహా సినిమాలను ఇష్టపడేవారికి నచ్చుతుంది. కానీ 'ఖైదీ' తరహాలోనే ఉండడం కొంత మైనస్.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...



**నిజమే...గవర్నమెంటు చాలా పెద్దది. బెనిఫిట్ షో, టికెట్ రేట్ల పెంపు చాలా చాలా చిన్నవి. తెలంగాణ ఫిలిం డెవెలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మాటల ఫ్లోలో అనుకోకుండా అనేశారో, లేక లోపల ముఖ్యమంత్రితో జరిగిన సమావేశ సారాన్ని ప్రతిబింబించడానికి ఉద్దేశపూర్వకంగానే అన్నారో కానీ నిజంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుకుంటున్నది అదే. రాజ్యం ముందు ఎవరైనా పిపీలికాలే. బహుశా నీళ్ళు నమలకుండా కుండబద్దలు కొట్టినట్లు తన సహజసిద్ధమైన పద్ధతిలో రేవంత్ ఈ విషయాన్ని సినిమావారికి బోధపరిచినట్లు ఉన్నారు. దాంతో సహజంగా దిల్ రాజు దిల్ లోపలినుండి అదే బయటికి వచ్చినట్లుంది.**


# రాజు-దిల్‌రాజు!



విజయనగర రాజ్య రాజధాని హంపీలో ఎప్పుడూ లేనిది ఒక ఎండవేళ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అంబారీ ఎక్కి రాచవీధిలో తిరుగుతున్నాడు. పక్కన గుర్రం మీద మహామంత్రి తిమ్మరుసు. ఆయన వెనుక సకల పరివారం. చక్రవర్తి తనకు తానుగా ప్రతి ఇంటి ముందు ఆగి సమస్యలేమైనా ఉన్నాయా! అని అడిగి ఉంటే వెంటనే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నాడు. ఒక ఇంటి వసారాలో నడుముకు తుండుగుడ్డ మాత్రమే కట్టుకుని ఉన్న ఒక బక్కచిక్కిన ముసలివాడు గుంజకు ఆనుకుని కునుకు తీస్తున్న దృశ్యం కృష్ణరాయల కంటపడింది. అందరికీ అన్నీ ఇస్తూ వస్తున్నాను. ఇతడు నిరుపేదలా ఉన్నాడు. ఏ అవసరముందో కనుక్కోండి.. ఇచ్చేద్దాం అన్నాడు. "మహాప్రభో! కొంప మునుగుతుంది. అతడు నాకు తెలుసు. మధ్యాహ్నం భోంచేసి హాయిగా నిద్రపోతున్నాడు. అతడికి రాత్రి భోజనం గురించి కూడా చింత ఉండదు. ఇప్పుడతడి నిద్రను భంగపరిస్తే విజయనగర మహా సామ్రాజ్యాన్నే శపిస్తాడు. మనకు అనవసరమైన తలనొప్పి. త్వరగా అంతఃపురానికి వెళ్ళి భోంచేద్దాం. పదండి. నామాట విని దయచేసి అతడిని కదిలించకండి" అని తిమ్మరుసు వేడుకున్నాడు. తిమ్మరుసు మాట విని కృష్ణరాయలు భద్రంగా ఇంటికెళ్ళాడు.

రాయలసీమ- కర్ణాటక సరిహద్దులో అయిదు శతాబ్దాలుగా ఈ కథ ప్రచారంలో ఉంది. నిజంగా ఇది జరిగిందో! కల్పితమో! తెలియదు.





"అవసరమైనవాడే రాజును అడుక్కుంటాడు. అవసరం లేనివాడు రాజునే తూ నా బొడ్డు అనగలడు" అని చెప్పడానికి ఉదాహరణగా ఈ కథను చెబుతుంటారు.

సినిమా అవసరాలు సినిమావారు అడిగినట్లే రాజ్యం అవసరాలు రాజు అడిగారు. రాజ్య ప్రాధాన్యాలను రాజు వివరించారు. ఇంత పెద్ద రాజ్యం ముందు బెనిఫిట్ షో, టికెట్ రేట్ల పెంపు ఎంత చిన్న విషయమో తెలిసిందని బహిరంగంగా చెప్పడం కూడా సిచువేషన్ బాగా డిమాండ్ చేసినట్లుగానే చూడాలి. రాజు కోరుకున్నదే దిల్ రాజు చెప్పారు.

మనవాతీతులమని, దైవాంశసంభూతులమని అనుకునేవారికి స్వస్వరూప జ్ఞానం కలిగించాలన్నది రేవంత్ ఉద్దేశం. "నా పేరు మరచిపోయినందుకు అల్లు అర్జున్‌ను జైల్లో పెట్టించాను- అని దుష్ప్రచారం జరుగుతుంటే ఒక్కరైనా నోరు విప్పలేదే?" అన్న రేవంత్‌కు ఉండాల్సిన స్పష్టత ఉంది. సినిమావారికే ఇంకా చాలా స్పష్టత రావాల్సి ఉంది. రాజును తూ నా బొడ్డు అనాలంటే ఒంటిమీద తుండుగుడ్డ తప్ప ఇంకేమీ ఉండకూడదు. కానీ మన పరిస్థితి అది కాదు కదా! రెండు అడగబోతే ఒక సెస్ మీద పడింది ప్రస్తుతానికి! ఇది కూడా రేవంత్ ఇవ్వదలుచుకున్న స్పష్టమైన సందేశమే.

"మాక్కావాల్సింది మీ దగ్గరుంది" అని వీరు సినిమా గేయ సాహిత్యాన్ని తాళంలో పాడబోతే..

"నాక్కావాల్సింది మీరు చేసి చూపించాల్సిందే" అని పోలీస్ కమాండ్ కంట్రోల్ నీలి ఆకాశహర్మ్య భవంతిలో తాళం లేకుండా సరళ వచనంలో స్పష్టంగా చెప్పి పంపారు ఆయన. ఆ నేపథ్యంలో-

"ఏ పాట నే పాడను?" అని వెతుక్కోకుండా ఒక్కొక్కరు వరుసగా ప్రభుత్వ పాటనే భయభక్తులతో మీడియా కెమెరాల ముందు పాడి వెళ్ళారు. సినిమా రాగతాళాలన్నీ స్టూడియోలవరకే. ముఖ్యమంత్రి ముందు అన్ని మేళకర్త రాగాలు, లయలు ప్రభుత్వరాగంలోనే లయమై ఉంటాయి. ఉండాలి.

హిమాలయాన్ని ఎడమకాలి కింద తొక్కి పెట్టిన భావానికి అభినయించే హీరోలు

హీరో లోతు కొలవలేక పాతాళం తలదించుకున్న సందర్భాల సాహిత్యం రాయించుకునే మేరునగ దర్శక, నిర్మాతలను పోలీస్ కంట్రోల్‌రూముకు పిలిపించి కూర్చోబెట్టి క్లాసు తీసుకోవడంలోనే హోమ్ శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ ప్రతీకాత్మకంగా చాలా సందేశమే ఇచ్చారు. భాగ్యనగరంలో ఇన్ని ప్రభుత్వ సమావేశ భవనాలుండగా లా అండ్ ఆర్డర్ ను ఆర్డర్లో పెట్టాల్సిన మీటింగ్ గా ఇదెందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరిగిందో, డి జి పి ఎందుకు మాట్లాడారో సినిమావారికి అర్థమయ్యే ఉంటుంది!

**నిజమే. గవర్నమెంటు చాలా పెద్దది. అప్పుడప్పుడూ రేవంత్ రెడ్లు కలుగజేసుకుని చెప్పేవరకు అది ఎంత పెద్దదో దానికీ తెలియదు! మనకూ తెలియదు!!**

-పమిడికాల్వ మధుసూదన్

## సిక్కోలు సోషల్ మీడియా అసోసియేషన్ కార్యవర్గం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


సిక్కోలు సోషల్ మీడియా అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసోసియేషన్ రిజిస్ట్రేషన్ అనంతరం కార్యవర్గం వివరాలను వెల్లడించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పాలకొండ ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్‌గా వరుడి కూర్మినాయుడు, కార్యదర్శిగా పసుపులేటి రాజా అరవింద్ సింగ్, సంయుక్త కార్యదర్శిగా మామిడి దిలీప్, కోశాధికారిగా ఉదయ భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.



## దేశం గొప్పనాయకుడిని కోల్పోయింది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశం ఓ గొప్ప నాయకుడిని కోల్పోయిందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆపద సమయంలో అనేక ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశప్రగతికి మన్మోహన్‌సింగ్ ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా అప్పటి యుపీఏ హయాంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. మన్మోహన్ మరణం యావత్ దేశానికి తీరనిలోటన్నారు.



## సమస్యలను పరిష్కరించాలి




(సత్యంన్యూస్, టెక్కలి)

విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ 43వ జిల్లా మహాసభలు సందర్భంగా టెక్కలిలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చందు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో ఉండే సమస్యల మీద, విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. దీనిలోభాగంగా దేశంలో మతోన్మాదభావజాలాలతో విద్యార్థుల మెదడులోకి మనువాదాన్ని చెప్పిస్తే భగత్‌సింగ్ వారసులుగా లౌకికత్వాన్ని సమాజంతటా విస్తరిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాల్లోనే తప్ప వాస్తవాల్లో విద్యార్థుల సమస్యలపై సరైన పరిష్కారాలు చూపించడం లేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దాదాపుగా ఏడు నెలలు కావస్తున్న ఇది మంచి ప్రభుత్వం అని తమకు తామే ఒక గుర్తింపు కార్డును ఇచ్చుకునే పరిస్థితిలో ఉన్నాయి తప్ప రాష్ట్రంలో గల ప్రధాన సమస్యల మీద ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికే విద్యార్థుల సత్తా ప్రపంచ రాజకీయ పరిస్థితులనే మార్చే దిశగా అడుగులు వేస్తుందని విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ దేశంలో కూడా పాలకులకు విద్యార్థులు అటువంటి సమాధానమే చెప్తారని హెచ్చరించారు. సనాతన ధర్మరక్షణలో ఉంటున్నామని చెప్తూ ప్రజలను మభ్యపెడుతూ ప్రధాన సమస్యలు అయినటువంటి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ విద్యారంగానికి హానికరమైనటువంటి అన్నిపి రద్దు కొరకు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రజాప్రతినిధులు ఇటువంటి రక్షణను చేపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ అటు ఇచ్ఛాపురం నుండి ఎచ్చెర్ల నియోజకవర్గం దాకా జిల్లావ్యాప్తంగా ఉండే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని, వారికోసం ఎంతటి ఉద్యమాన్ని అయినా భవిష్యత్తులో చేయడానికి సంసిద్ధమని అన్నారు. జిల్లాలో అగ్రగామిగా ఉన్నటువంటి శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్‌కు సొంత హాస్టల్ లేకపోవడం వల్ల విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే కళాశాలకు హాస్టల్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు అలాగే హాస్టల్‌కు సొంత భవనాలు కేటాయించాలని జిల్లాలో ఉన్నటువంటి మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంజూరైనప్పటికీ వాటికి సొంతభవనాలు లేక విద్యార్థులు అరకొర చదువులు చదువుతున్నారని, తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గర్ల్స్ కన్వీనర్ పి.పవిత్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల అభ్యున్నత కోసం వాగ్దానాలు మాత్రమే చేస్తున్నారని వాస్తవాలు అవి వెలుగు చూడడం లేదని విమర్శించారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు లోపే రాష్ట్రంలో ఎన్నో హత్యలు అత్యాచారాలు జరిగిన ప్రజాప్రతినిధులు కేవలం పత్రికా ప్రకటనలు పరిమితమయ్యారని మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యు.దుర్గాప్రసాద్, సీహెచ్ రాజు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 'కిమ్స్' ఫౌండేషన్‌కు ఉత్తమ అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ వారు యువత నైపుణ్యాభివృద్ధికి ఉభయ తెలుగురాష్ట్రాల్లో అందిస్తున్న సేవలకు తగిన గుర్తింపు లభించింది. కీట్స్ ఫౌండేషన్ వారు ఆ సంస్థకు ఉత్తమ భాగస్వామి శిక్షణ కేంద్రం అవార్డును అందించారు. ఎన్టీఆర్ జిల్లాలోని అంబరుపేట వద్ద గల ఆ సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన డీసెన్నియల్ సెలబ్రేషన్స్‌లో ఈ అవార్డును బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావుకు న్యూజెర్సీలోని రాట్‌గర్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.విజయలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో యువత నైపుణ్యాభివృద్ధికి తమ సంస్థ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా ఎనలేని కృషి చేస్తున్నామన్నారు. వేలాదిమంది నిరుద్యోగులకు వివిధ నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఉచితంగా అందజేసి, ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాలను తీర్చిదిద్దామన్నారు. ఇప్పటివరకు ఎన్నో సంస్థలనుంచి ఉత్తమ అవార్డులు పొందినా.. కీట్స్ వారితో కలిసి పని చేసిన తొలి ఏడాదిలోనే ఈ అవార్డు సాధించడం తమకెంతో ప్రత్యేకమన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో వందలాది డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందించి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. తమ సేవలను గుర్తించిన సంస్థ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ముమ్ముందు ఎంతో మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడానికి ఈ అవార్డు దోహదపడుతుందన్నారు. కార్యక్ర మంలో ఏపీ సీడాప్ చైర్మన్ జి.దీపక్‌రెడ్డి, కీట్స్ చైర్మన్ డీవీ గిరిధర్, వైస్ చైర్మన్ జి.జనార్దనరావు, మేనేజింగ్ ట్రస్టీ వైఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రా॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు అయిన **1. లోకనాథం పార్వతీశ్వరరావు (S/o లేటు లింగయ్యస్వామి), 2. లోకనాథం ఆనందరావు (S/o లేటు లింగయ్యస్వామి), 3. లోకనాథం రాంబాబు (S/o లేటు లింగయ్యస్వామి), 4. లోకనాథం చంద్రశేఖర రావు (S/o లేటు లింగయ్యస్వామి), 5. దేవళ్ల జగదీశ్వరి (W/o ఆనందకుమార్)** జన ఐదుగురు ఏకస్తులై ఇచ్చిన భోగట్టాపై యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా..

పైన తెలిపిన నా క్లయింట్లు **రెవెన్యూ సర్వే నెంబరు 372, టి.ఎస్. నెంబరు 757 పార్ట్‌లో ముప్ఫైఎనిమిదిన్నర సెంట్లు** స్థలానికి వారసులై వున్నారు. షెడ్యూల్ దఖలు ఆస్తిని ఇంతవరకు నా క్లయింట్లు ఎవ్వరికీ ఎటువంటి అమ్మకములు కూడా చేయలేదు. సదరు ఆస్తి నా క్లయింట్లకు వారసత్వముగా దఖలుపడి, హక్కు అనుభవంలో ఉన్నది. సదరు ఆస్తిపై ఈమధ్యన **కళింగపట్నానికి చెందిన వాసుపల్లి దుర్గాప్రసాద్, వాసుపల్లి గీత** అనే అసామీలు వారి తల్లిదండ్రులైనటువంటి లేటు వాసుపల్లి వైకుంఠరావు, లేటు నాగరత్నంల నుండి దఖలు పడినదని ఇతరులకు అమ్మజూపుతున్నారని తెలియవచ్చినది. పై ఆస్తి విషయములో ఎవరైనా ఎటువంటి క్రయవిక్రయాలు గాని, లావాదేవీలు గాని జరుపరాదనియు, మరియు అట్లు జరిపినయెడల చెల్లనేరవనియు, వారి సొమ్ము నష్టపోవుదురనియు, అట్టి వ్యవహారములు నా క్లయింట్లకు బంధింపబడనివనియు, అటువంటివారిపై నా క్లయింట్లు తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

**NOTICE SCHEDULE:**

Srikakulam District, Srikakulam Mandalam, Town and Municipality, Srikakulam Sub-Registrar, property, situated in Pata Srikakulam RS.No.372 T.S.No. 757 part extend 38 1/2 Cents Vacant dryland within the following boundaries:

**East:** Road leads to Way to Nagavali river **South:** Property belongs to Lokanatham Prasadarao., **West:** Lokanatham Nandikeswara Rao and others dryland, **North:** 20 Feet Road.

**ఎం.ఎస్. వినయ్‌భూషణరావు**
బి.ఎ., బి.ఎల్., అడ్వకేట్, న్యూకాలనీ, శ్రీకాకుళం.
Cell: 94401 12861


# నిధులున్నా సౌకర్యాలు సున్న

మొదటిపేజీ తరువాయి

హాస్టల్‌కు వెళుతూనే అక్కడ సమస్యలను గుర్తుకుతెచ్చుకొని డీలా పడిపోతున్నారు. కాలేజీలో ఉన్న మరో విచిత్రం ఏమిటంటే.. మొదటి ఏడాది విద్యార్థులు వారి గదుల్లోనే చదువుకోవాలి. రెండు నుంచి నాలుగో ఏడాది విద్యార్థులు మాత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్, లైబ్రేరీలో చదువుతారు. ఇక్కడ మొదటి ఏడాది విద్యార్థులు చదవడానికి వీల్లేదు. ఈ రూల్ రిమ్స్ అధికారులు పెట్టారో? సీనియర్ విద్యార్థులు పెట్టారో తెలియదు. హాస్టల్ లైబ్రరీలో మొదటి ఏడాది విద్యార్థులకు ఎంట్రీ లేదంటే నమ్మశక్యం కాదు. ప్రిన్సిపల్ దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం చూపించడంలేదని తెలిసింది.

**విద్యార్థుల చందాలతో ల్యాప్‌టాప్**

ఈ ఏడాది అదనంగా 50 సీట్లు పెంచడంతో ఒక్క క్లాసులో 200 మంది విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సి వస్తుంది. దీనికోసం తరగతి గదిలో ఏర్పాటుచేసిన ఆడియో, వీడియో సిస్టమ్స్ పాడైపోయాయి. అయినా వాటినే వినియోగిస్తున్నారు. వీటిని మార్చాలని ప్రిన్సిపల్‌కు విన్నవిస్తే కనెక్టెడ్ ల్యాప్‌టాప్ పాడైందని, దీన్ని మీరే కొనుగోలు చేసుకోవాలని విద్యార్థులకు సూచించినట్టు తెలిసింది. దీంతో తలా రూ.300 జమ చేసి ఒక ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసుకున్నారు. ల్యాప్‌టాప్ కొనుగోలు చేసినా స్క్రీన్ బాగులేకపోవడంతో విద్యార్థులు ఇప్పటికీ తరగతి గదుల్లో ఇబ్బంది పడుతున్నారని తెలిసింది. ల్యాప్‌టాప్ కొనుగోలు చేసుకున్న మాదిరిగా ఆడియో సిస్టం, స్క్రీన్ కొనుక్కోవాలని అధికారులు విద్యార్థులకు చెబుతున్నారని విశ్వసనీయ సమాచారం. తరగతి గదుల్లో అవసరమైన మెటీరియల్స్ కోసం రిమ్స్‌లో నిధులు ఉన్నా వాటిని ఖర్చు చేయడం లేదని తెలిసింది. రిమ్స్‌లో వైద్య విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి రాకుండా అధికారులు గట్టి చర్యలే తీసుకున్నారని తెలిసింది. విద్యార్థుల తల్లిదండ్రులు బాయ్స్ హాస్టల్‌లో వారి పిల్లలకు కనీస సౌకర్యాలు కల్పించడంలేదని మండిపడుతున్నారు. అయితే వారు ఎవరికైనా ఫిర్యాదు చేస్తే వారి పిల్లలు ఇబ్బంది పడతారని భయం వారిని వెంటాడుతుంది. రిమ్స్‌లో వైద్య విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై జిల్లాకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి. రిమ్స్ జనరల్ ఆసుపత్రి పనితీరుపై సమీక్షించే ప్రజాప్రతినిధులు రిమ్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి హాస్టల్, మెస్‌పై కూడా సమీక్షించాలని చాలామంది కోరుతున్నారు.

## 3న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు జనవరి 3న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి. శ్రీధర్‌రాజా పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీచేసారు. ఉదయం 10.30 గంటలకు 6వ స్థాయి, 11.30 గంటలకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12.30 గంటలకు 5వ స్థాయి సంఘం సమావేశం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 2,4,1,7 స్థాయి సంఘాల సమావేశాలు జరగనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

## 1 నుంచి సదరం క్యాంపులకు బ్రేక్

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

జనవరి ఒకటి నుంచి సదరం క్యాంపులు, సదరం సర్టిఫికెట్ల పంపిణీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వికలాంగ ధ్రువీకరణ పత్రాల తనిఖీల ప్రక్రియ పూర్తయ్యేవరకూ కొత్త వికలాంగ సర్టిఫికెట్ల జారీని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

## 29న తూర్పుకాపు ఆత్మీయ కలయిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా అత్యధిక శాతం జనాభా కలిగిన తూర్పుకాపు సామాజిక వర్గం ఆత్మీయ కలయిక సదస్సు ఈ నెల 29న ఆదివారం ఎచ్చెర్ల కేశవరెడ్డి స్కూల్ పక్కన జరుగుతుందని నిర్వాహక కమిటీ ప్రతినిధులు డోల జగన్‌మోహన్, సురంగి మోహనరావు, శాసపు జోగినాయుడు, లంక గాంధీ, ఇజ్జాడ శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుకాపుల ఐక్యతను చాటిచెప్పే ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తూర్పుకాపు సామాజికవర్గ ప్రతినిధులు హాజరవుతున్నారని, ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తూర్పు కాపు సామాజికవర్గానికి చెందినవారంతా తరలిరావాలని ఆ ప్రకటనలో వారు కోరారు.

# 75 ఏళ్ల వయసులోనూ..!

## పచ్చళ్ల వ్యాపారం చేసుకుంటున్న బామ్మ

**75 ఏళ్ల వయసులో ఎవరైనా బండెడు అనారోగ్య సమస్యలతో కాలం వెల్లదీస్తుంటారు. కానీ మీనాక్షి మెహ్రా మాత్రం 75 ఏళ్ల వయసులో విజయవంతంగా వ్యాపారం చేస్తుంది. మామ్‌మేడ్ అనే బ్రాండ్‌తో ఆర్గానిక్ పచ్చళ్లు చేస్తుంది.**



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో పుట్టిన మీనాక్షికి చిన్నప్పటి నుంచే ధైర్య సాహసాలు ఎక్కువ. మీనాక్షి కుటుంబ సభ్యులు ఆమె చదువుకునే రోజుల్లో.. ఇంటీరియర్ డిజైన్ పట్ల ఆమెకున్న ఆసక్తిని గుర్తించి, ఆ రంగంలో విద్యను అభ్యసించమని ఆమెను ప్రోత్సహించారు. ఆమె చండీగఢ్ పాలిటెక్నిక్ కళాశాలలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. తర్వాత ఢిల్లీలో తన ఇంటీరియర్ డిజైన్ కోర్సును పూర్తి చేసింది. కోవిడ్ మహమ్మారి సమయంలో మీనాక్షి పచ్చళ్లు తయారుచేసే వ్యాపారం ప్రారంభించింది. తన తల్లి ప్రోత్సాహంతో 2021లో 72 ఏళ్ల వయసులో ఆమె మామ్‌మేడ్‌ను ప్రారంభించింది, పచ్చళ్లు, స్వీట్లు, నామ్‌కీన్, చట్నీలు, పానీయాలతో సహా అనేక రకాల ఉత్పత్తులను అందిస్తోంది. ఈ ఆహార పదార్థాలను తయారుచేసేందుకు మీనాక్షి 100 శాతం సేంద్రీయ పదార్థాలను ఎంచుకుంటుంది. రుచిలో రాజీ పడకుండా పోషక విలువలను మెరుగుపరచడానికి, ఆమె చక్కెరను బెల్లం వంటి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలతో భర్తీ చేస్తుంది. అదనంగా, ఆమె చిన్న బ్యాచ్‌లలో ఊరగాయలను సిద్ధం చేస్తుంది, కస్టమర్ ఆర్డర్‌లకు అనుగుణంగా, ప్రతి దశను స్వయంగా పర్యవేక్షిస్తుంది. ఆమె బెస్ట్ సెల్లర్స్‌లో పంజాబీ మామిడికాయ పచ్చడి, నింబు కట్టా-మీటా, కరేలా, ఊరగాయ, వెల్లుల్లి ఊరగాయ వంటి క్లాసిక్ ఇష్టమైనవి ఉన్నాయి. ఇతర ఉత్పత్తులలో బేసన్ బర్ఫీ, లడ్డూలు, బెల్లము ఉన్నాయి. వినూత్న రుచుల కోసం మీనాక్షి ఎప్పుడూ ఆరాటపడుతుంది. యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కొత్త కొత్త వంటలు తెలుసుకుంటుంది. ఈ రోజు, మూమ్‌మేడ్ తన కస్టమర్ బేస్‌ను ఢిల్లీ, బొంబాయి నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు విస్తరించింది. మన కలలను నెరవేర్చుకోవడానికి వయసు అనేది ఏమాత్రం అడ్డంకి కాదని మీనాక్షి నిరూపించింది. చాలామంది పరిస్థితుల వల్ల వారికి ఇష్టమైన పనిని వదిలేసి వేరే ఏవేవో ఉద్యోగాలు చేస్తుంటారు. అలా చేసినప్పటికీ.. ఒక స్టేజ్ వచ్చాక మళ్లీ మన కలల వైపు అడుగులు వేయడంలో ఏమాత్రం తప్పు లేదని మీనాక్షి నిరూపించింది. మీనాక్షి మెహ్రా కథ ఎంతోమందికి స్ఫూర్తిని అందిస్తుంది.

- సత్యం ఐటీ డెస్క్

## ఆందోళన చేసే అర్హత వైకాపాకు లేదు

- వైకాపా పాలనలోనే కొనుగోళ్లు పేరుతో మోసం చేశారు
- విద్యుత్ ఛార్జీల వ్యవహారంపై దమ్ముంటే చర్చకు రండి
- రాష్ట్ర ఖజానాకు వచ్చిన నష్టాన్ని పూడ్చేందుకు శ్రమిస్తున్నాం
- ఎమ్మెల్యే గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపారంటూ ఆందోళన చేసే అర్హత వైకాపాకు లేదని ఎమ్మెల్యే గొండు శంకర్ ధ్వజమెత్తారు. వైకాపా ఐదేళ్ల పాలనలో విద్యుత్ కొనుగోళ్ల పేరుతో ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు నష్టం వాటిల్లేలా చేసి ప్రజలను మోసం చేశారన్నారు. విశాఖ-ఏ కాలనీలోని తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి నేటి వరకు కరెంట్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. వైకాపా పాలనలో అధిక రేటుకు విద్యుత్‌ను కొనుగోలు చేసి దోపిడీకి పాల్పడ్డారని, రాష్ట్ర ఖజానాకు చేసిన నష్టాన్ని పూడ్చేందుకు తమ ప్రభుత్వం శ్రమిస్తోందన్నారు. తక్కువ ధరకే దొరికే విద్యుత్‌ను ఎక్కువ ధరకు కొనుగోలు చేసి పెనుభారాన్ని వైకాపా ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థలపై మోపారన్నారని, అన్ని వ్యవస్థల్లోనూ అవినీతి కేంద్ర బిందువుగా చేసుకొని ఐదేళ్ల పాటు ప్రజాధనాన్ని లూటీ చేసిన వైకాపా నేతలు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ధర్నాలు చేస్తున్నారని గొండు శంకర్ ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల వ్యవహారంపై దమ్ముంటే వైకాపా శ్రేణులు చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ అన్ని వ్యవస్థల పనితీరు మెరుగుపరుస్తూ సమష్టిగా ముందుకు సాగుతున్నామని, ఉనికి కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడపాదడపా ఇలాంటి కార్యక్రమాలు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే శంకర్ ఎద్దేవా చేశారు. ప్రజా విశ్వాసంతో పాటు పార్టీ శ్రేణుల నమ్మకాన్ని కూడా వైకాపా కోల్పోయిందని ఆయన విమర్శించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ శీర రమణయ్య, టీడీపీ నాయకులు చిట్టి మోహన్, పాండ్రంకి శంకర్, ఎండు చిన్నారావు, పంచిరెడ్డి అప్పలనాయుడు తదితరులున్నారు.

## మొక్కల పెంపకం సామాజిక బాధ్యత



(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

మొక్కల పెంపకం సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ గుర్తించాలని ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ప్రిన్సిపాల్ వి.శంకరరావు అన్నారు. కళాశాల మైదానంలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్.) పి.పి. ఎస్.రజనీకుమారీ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకరరావు మాట్లాడుతూ మొక్కలు పర్యావరణ, ఆత్మీయ నేస్తాలని తెలిపారు. విరివిగా చెట్లు పెంపకం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఎ.జి.ఎం.ఓ. ప్రియాసుధాకర్, సీనియర్ అధ్యాపకలు ఆర్.యుగంధర్, ఎన్.బాపూజీ, పి.ప్రసాదరావు, కె.జగదీష్, బి.కరుణాకరరావు, బి.సునీత తదితరులు పాల్గొన్నారు

## తమిళనాడు ఎంపీ గోపీనాథ్‌కు 'మహోన్నత శిఖరాలు' బహూకరణ



(సత్యంన్యూస్, పొందూరు)

విజయవాడ కేబీఎన్ కళాశాల ఆవరణలో జరుగుతున్న ప్రపంచ ఆరవ తెలుగు రచయితల మహాసభల్లో శనివారం కృష్ణగిరి (తమిళనాడు) ఎంపీ, తెలుగు భాషా ప్రియుడు కె.గోపీనాథ్‌కు పొందూరుకు చెందిన శ్రీశ్రీ కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రాజారావు తాను రాసిన మహోన్నత శిఖరాలు పుస్తకాన్ని బహూకరించారు. మహాసభల్లో చెరుకూరి రామోజీరావు ప్రాంగణంలో ఈ పుస్తకాన్ని ఆయనకు అందజేసినట్టు రాజారావు తెలిపారు. తెలుగు భాషకు ఆదరణ తగ్గుతున్న ఈ దశలో తెలుగు రచయితల మహాసభలు నిర్వహించడం గర్వకారణంగా ఉందని, మంచి జరుగుతుందని కృష్ణగిరి ఎంపీ గోపీనాథ్ పేర్కొన్నారని, లోక్‌సభలో తాను తెలుగులోనే ప్రమాణస్వీకారం చేసినట్టు తన ఆనందాన్ని రాజారావుతో పంచుకున్నారు. మరిన్ని పుస్తకాలు రాసి తెలుగుభాషకు సేవ చేయాలని ఎంపీ గోపీనాథ్ రచయిత రాజారావుకు సూచించారు.

# గడ్డే తినోళ్లకి డబ్బో లెక్కా!

- అజోలా కిట్స్ పేరుతో రూ.70 లక్షలు మింగేశారు
- కొనుగోళ్లు, పంపిణీ అన్నీ రికార్డుల్లోనే
- బంధువులు, బినామీలు పాడిరైతులే
- పాతపట్నంలో మినరల్ మిక్చర్‌నూ వీరే తినేశారు
- పశు సంవర్ధక శాఖలో అంతులేని అవినీతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో పశు సంవర్ధక శాఖ పరిధిలో 2017-18 ఆర్థిక సంవత్సరంలో అజోలా కిట్స్ (దాణా) పేరుతో ఆర్‌ఐడీఎస్ యాప్‌లో ఆన్‌లైన్ చేయకుండానే రూ.70 లక్షలు నిధులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అదే ఏడాది చూలు ఆవుల కొనుగోలు, గొర్రెలు పంపిణీ, పెరటికోళ్ల పెంపకం కోసం ప్రభుత్వం మంజూరుచేసిన రూ.7.60 కోట్లు దుర్వినియోగం చేసినట్టు వచ్చిన ఆరోపణలపై 'సత్యం'లో కథనం ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. ఇదే అంశంపై తాజాగా మరికొన్ని అంశాలు బయటపడ్డాయి. వీటిని కొనుగోలు చేసినట్లు రికార్డులు చూపించిన అధికారులు పంపిణీ దగ్గరకొచ్చేసరికి మాత్రం నచ్చిన వారికి టెండర్లు అప్పగించి రైతులంటూ స్వయంగా వారి కుటుంబ సభ్యులు, బినామీల పేరుతో యూనిట్లు పంపిణీ జరిపినట్లు రికార్డుల్లో చూపించారని తెలుస్తుంది. తలసరి ఆదాయంలో వెనుకబడిన పాతపట్నంలో రైతుల ఆదాయం పెంచేందుకు పాడిపశువులు పంపిణీకి వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక నిధుల నుంచి రూ. 8కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇందులో రూ.1.78 కోట్లు మినరల్ మిక్చర్ కొనుగోలుకు కేటాయించారు. అయితే కొనుగోలు చేసినట్టు చూపిస్తున్న సంస్థకు ట్రాక్ రికార్డు లేదని, ఇది కేవలం బినామీ బిల్లు తెచ్చి రూ.1.78 కోట్లు మింగేశారని ఆరోపణలున్నాయి. పశువులు కొనుగోలు చేయకుండానే వాటికి మందులు కొనుగోలు చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులపై ఇప్పటికే విమర్శలున్నాయి. యానిమల్ ఇండక్సన్ స్కీం ద్వారా మంజూరైన రూ.2.73 కోట్లు ఎచ్చెర్ల, కోటబొమ్మాళికి తరలించి బంధువుల పేర్లతో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ప్రస్తుతం ఉన్న అధికారులపై ఆరోపణలున్నాయి. వైకాపా హయాంలో వివిధ స్కీమ్‌ల కింద మంజూరైన నిధులను దుర్వినియోగం చేసిన అధికారులు వాటిని కప్పిపుచ్చుకొనే ప్రయత్నాల్లో ప్రస్తుతం ఉన్నారు. జిల్లాలో డీడీ, జేడీ స్థాయిలో పనిచేసిన, పనిచేస్తున్న వారంతా నిధుల దుర్వినియోగంలో బాధ్యులేనని విమర్శలు ఉన్నాయి. వీరంతా జిల్లా కేంద్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తూ ప్రజాప్రతినిధులను తప్పుదోవపట్టించి పబ్బం గడుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2014-19 మధ్య టీడీపీ పాలనలో జిల్లా పశుసంవర్ధక శాఖలో అధికారులుగా పనిచేసినవారే, ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వ హయాంలోనూ అధికారులుగా ఇక్కడే కొనసాగారు. రెండు ప్రభుత్వాలతో అంటకాగి రూ. కోట్లలో దోపిడికి పాల్పడారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆ అధికారులే ఇన్‌చార్జీలుగా వస్తున్నారు. రైతుల మెడపై కత్తిపెట్టి పశుమత్స్యదర్శిని మాసపత్రిక పేరుతో రెండేళ్లకు రూ.500 వసూలుచేశారు. ఈ మొత్తం రూ.4.65 కోట్లు మూడు నెలల్లోనే ఖర్చు చూపించి మెక్కేశారు. అందులో జిల్లా వాటాగా పెద్ద మొత్తంలోనే ఇక్కడివారికి అందినట్టు భోగట్టా. దీనిపై ఎచ్చెర్లలోని ఒక ఏహెచ్‌ఏ ఏసీబీకి ఇచ్చిన ఫిర్యాదుతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.